క్లుప్తంగా

ఉర్దూ పాఠశాలకు నూతన భవనం నిర్మించండి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని గాంధీ నగర్‌లో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాల భవనాలు పూర్తి అధ్వానంగా మారాయని, వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ కోరారు. సోమవారం స్థానిక పాఠశాలను ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సందర్శించి పాఠశాల స్థితిగతులను పరిశీలించారు. విద్యార్థులు ప్రమాదానికి గురి కాకముందే చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ముస్తఫా, రఘు, నరసింహులు ఉన్నారు.

ఎల్‌ఎల్‌సీలో చెత్త వేస్తే చర్యలు


ఎల్‌ఎల్‌సీలో చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న ఏఈఈ రామాంజినేయులు

పెద్దకడబూరు : ఎల్‌ఎల్‌సీ చెత్తా చెదారంతో పాటు ఏవైనా జంతు కళేబరాలు వంటివి వేస్తే చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈఈ రామాంజినేయులు హెచ్చరించారు. మండల పరిధిలోని ఎల్‌ఎల్‌సీలో పేరుకుపోయిన చెత్తా చెదారంతో పాటు జంతు కళేబరాలను సోమవారం జేసీబీ సహాయంతో తొలగించారు. ఆయన మాట్లాడుతూ తాగునీరు కలుషితం అయ్యి ప్రజలు రోగాలబారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఒబులేసు, లస్కరు గులాం ఉన్నారు.

ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

నేడు సుదర్శన హోమం

ఈరన్నస్వామి ఆలయంలో మంగళవారం సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. భక్తులు 9గంటల లోపు సేవా రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకుని పాల్గొనాల న్నారు. అలాగే సంకటహర చతుర్థి కావడంతో గణపతి హోమం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: అనుమతులు లేకుండా రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్ నిర్వహిస్తున్నవారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న టిడ్కో ఎస్‌ఈపై మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ పట్టణాధ్యక్ష కార్యదర్శులు వీరేష్, వెంకటేష్, రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ఆదోని సెంట్రల్: నూతన పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి పది నెలలు కావస్తున్నా ఉద్యోగులకు సంబంధించి ఆర్థిక పరమైన అంశాలను పరిశీలించలేదన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారన్నారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్స్, పీఎఫ్ బిల్లులను చెల్లించాలని కోరారు.

యూనిక్ ఐడీ..

అందరికీ కాదండీ!

- సొంత పట్టాలు కలిగిన వారికే నమోదుకు అవకాశం
- డీకే పట్టాలు, కౌలు రైతులపై రాని స్పష్టత
- భూ ఆధార్ లేకపోతే పథకాల కోతపడే అవకాశం
- ఆందోళనలో అన్నదాతలు

పెద్దకడబూరు : ఆధార్ తరహాలో అన్నదాతలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సొంత భూ పట్టాలు కలిగిన ప్రతి రైతుకు 11 అంకెల గుర్తింపు సంఖ్యను జారీ చేసే ప్రక్రియను వ్యవసాయ సిబ్బంది చేపడుతున్నారు. గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అయితే దీనిపై స్పష్టత కొరవడడంతో కౌలు రైతులు, అసైన్డ్, డీకేటీ పట్టా భూములు కలిగిన రైతులకు రిజిస్ట్రేషన్ ఆప్షన్ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అన్ని రకాల రైతులకు ఈ కార్డులను అందజేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆందోళనలో అన్నదాతలు

భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలకు విశిష్ట గుర్తింపు సంఖ్య (భూ ఆధార్) ప్రామాణికం కానుంది. లేనిపక్షంలో ఎలాంటి పథకాలు అందవని అధికారులు తెలియజేస్తున్నారు. దీంతో రైతులు రైతు సేవా కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. అయితే ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై స్పష్టత లేక కొంత మంది అసైన్డ్, డీకేటీ పట్టా భూములు కలిగిన రైతులు రైతుసేవా కేంద్రాలకు వెళ్లి ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆప్షన్ లేదని అధికారులు చెప్పడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు కౌలు రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి తమకు ఎలాంట సమాచారం లేదని అధికారులు చెబుతుండడంతో వీరంతా తమకు పథకాలు అందుతాయో లేదోనని మదనపడుతున్నారు. అలాగే దేవాదాయ, అటవి భూములు సాగు చేసుకునే


పెద్దకడబూరులోని రైతుసేవా కేంద్రంలో రైతుల పట్టాలను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

వారు యూనిక్ కార్డుల ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ఇంటర్‌నెట్.. సర్వర్ సమస్యలతో జాప్యం

మండలంలో సొంత పట్టాలు కలిగిన రైతులు 9,500లకు పైగా ఉన్నారు. వారిలో ఇప్పటికే 8,500ల రైతుల రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇంటర్‌నెట్ సక్రమంగా రాకపోవడం, సర్వర్ సమస్యలు తలెత్తడం తదితర సమస్యలతో ఈ ప్రక్రియ నిధానంగా నడుస్తోంది. మరోవైపు కొంతమంది రైతుకు ఆధార్‌కు సంబంధించిన ఓటీపీలు సక్రమంగా రాకపోవడంతో సనమోదులో సమస్యగా మారుతుంది. అయితే ఓటీపీలు రాని రైతుల ఐరిష్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే సమయంలో భూ ఆధార్ పేరుతో కోత పెడుతారేమోనని డీకేటీ పట్టాలు కలిగిన రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోండి



మనకు ఆధార్ ఎలా ఉంటుందో అలాగే రైతులకు భూ ఆధార్ కార్డులు అందజేస్తారు. ఈ కార్డుల వల్ల రాబోయే కాలంలో అనేక ప్రయోజనాలు ఉంటాయి. మండలంలోని ప్రతి రైతు తమ భూముల వివరాలతో రైతుసేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు దాదాపు 80శాతం వరకు రిజిస్ట్రేషన్ అయ్యింది. భూ ఆధార్‌ను బేస్ చేసుకొని వచ్చే పీఎం కిసాన్ ఇస్తారు అని అంటున్నారు.
– ఎం.వరప్రసాద్ మండల వ్యవసాయాధికారి

కౌలు రైతులకు అన్యాయం జరుగుతోంది



కౌలు రైతులకు భూ ఆధార్‌తో చాలా అన్యాయం జరుగుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సొంత భూమి ఉన్నవారితో పాటు కౌలు రైతులకు కూడా రైతు భరోసా అందేది. అయితే ప్రస్తుత కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల మంజూరుకు విశిష్ఠ సంఖ్యను మెలికపెట్టడం, సొంత భూమి ఉన్నవారికే భూ ఆధార్ నమోదు చేయడం అంటే కౌలు రైతులను పథకాలకు దూరం చేయడమే. కూటమి సర్కారు మరోమారు హామీలతో రైతులను దగా చేసింది. ప్రజలకు అందించే సంక్షేమ పథకాలకు నామాలు పెట్టింది. – తిక్కన్న సీపీఎం మండల కార్యదర్శి

ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయాలి

గోనెగండ్ల : వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అసంక్రమిత వ్యాధులైన రొమ్ము, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలను చేయాలని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. సోమవారం స్థానిక ఆస్పత్రిలో ఎన్‌సీడీ-సీడీ వ్యాధుల స్క్రీనింగ్ పురోగతిపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అసంక్రమిత వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి ఆరోగ్య పరీక్షలు చేసి క్యాన్సర్ వ్యాధి దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్లు దాటిన వారందరికీ రక్తపోటు, మధుమేహం, రక్తహీనత పరీక్షలు చేయాలన్నారు.


మాట్లాడుతున్న సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు

కార్యక్రమంలో డాక్టర్లు రంగరవళి, రుక్సానా, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు మేరీ గోల్డ్, భారతి, హనుమంతు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కల్లుగీత కార్మిక సంఘం ఎన్నికలు

ఆదోని రూరల్: ఎన్నో ఏళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న కల్లుగీత కార్మిక సంఘం ఎన్నికలు సోమవారం ఆదోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. ఈ ఎన్నిక కార్యవర్గ సభ్యులకు మాత్రమే నిర్వహించినట్లు ఎన్నికల అధికారి ఫజిలేఇలాహీ తెలిపారు. 2024లో జరగాల్సిన ఎన్నికలు కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో జరపలేదన్నారు. చివరకు హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సూచన మేరకు ఐదు మంది కార్యవర్గ సభ్యుల ఎన్నికలు నిర్వహించినట్లు చెప్పారు. ఇందుకుగానూ 11 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. ఉరుకుందగౌడ్, సుందర్‌రాజ్‌గౌడ్, మనోహర్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, నరసింహులు గౌడ్ ఎన్నికయ్యారన్నారు. వీరు మంగళవారం అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సైదుల్లా, సిబ్బంది, కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

ఎమ్మిగనూరురూరల్: సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పనిభారం తగ్గించి, ఒక ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు ఒకే శాఖను కేటాయించాలని సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో పీఆర్ ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ అధికారులకు వనితి పత్రాలను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖర్, సెక్రటరీ ఈరన్న, ట్రెజరర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రకృతి' కూరగాయల ప్రదర్శన

కోసిగి: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు నాణ్యమైన దిగుబడి వచ్చిందని ఆర్లబండ, కొల్మాన్‌పేట, దుద్ది గ్రామ రైతులు కిష్టప్ప, నాగరాజు, కృష్ణ, తాయన్న, హనుమంతు, సతీష్ తెలిపారు. సోమవారం కోసిగి స్త్రీ శక్తి భవన కార్యాలయ ఆవరణలో కొల్మాన్‌పేట యూనిట్ రాజమ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయాల స్టాల్స్ ఏర్పాటు చేశారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

నందవరం : పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పుల్లయ్య, హౌసింగ్ డీఈఈ ప్రసాద్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మండలంలో వివిధ దశలో 262 గృహాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఆదోని రూరల్: మండలంలోని గణేకల్ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో సచివాలయాన్ని ముట్టడించారు. సచివాలయానికి తాళం వేసి నిరసన తెలియజేశారు. సీపీఎం మండల కార్యదర్శివర్గసభ్యులు బి.వీరారెడ్డి మాట్లాడుతూ గత 15 రోజులుగా కుప్పగల్ ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి తాగునీటి సరఫరా చేయకుండా అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అలాగే గ్రామంలో పంచాయతీ మోటార్ నుంచి నీటి సరఫరా సరిగా చేయకపోవడం, ఉన్న పైపులైన్‌లకు లీకేజీలు సరి చేయకపోవడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ నాయకులు పరమేష్, రంగస్వామి, మల్లయ్య, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.


సచివాలయానికి తాళం వేసి నిరసన తెలియజేస్తున్న ప్రజలు, సీపీఎం నాయకులు

శిశువు మరణానికి కారకులపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువు మరణానికి కారణమైన వైద్యులు, గర్భిణికి ప్రసవం చేసిన నర్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. గోనెగండ్లకు చెందిన సువార్తమ్మ అనే గర్భిణి ప్రసవం కోసం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే వైద్యులు లేకపోవడంతో విధుల్లో వున్న నర్సులు ప్రసవం చేయడంతో శిశువు మృతి చెందినట్లు ఆరోపించారు.

టీబీపై అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్: టీబీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు షేకున్‌బాను, షాహీన్‌బేగం, అనిల్‌సాగర్, వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని అరుంధతినగర్ యూపీహెచ్‌సీలో ప్రజలకు టీబీపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి విపరీతమైన దగ్గు, జ్వరం ఉంటే వెంటనే ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గల్ల పరీక్ష, ఎక్స్‌రే చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు, సుబ్బమ్మ, లలితమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

ఎమ్మిగనూరుటౌన్: అధికారంలోకి వచ్చి 9నెలలు గడుస్తున్నా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఆయా హామీలను వెంటనే అమలు చేయాలని భగత్ సింగ్ యువజన సంఘ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం ఇచ్చారు.

బలాదూర్ ఎల్లమ్మ ఆలయంలో చోరీ

ఆదోని రూరల్: మండలంలోని బలాదూర్ ఎల్లమ్మ దేవస్థానంలో సోమవారం తెల్లవారుజామున అమ్మవారి గంటలు చోరీకి గురైనట్లు గ్రామస్తులు ఇస్వీ పోలీసులకు తెలిపారు. పోలీసులు ఆలయాన్ని ప్రాంగణాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలి

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కార్మిక రంగానికి రూ.2వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని కూటమి ప్రభుత్వానికి ఏపీ చేనేత కార్మిక సంఘ తాలూకా కార్యదర్శి కాలప్ప డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి చేనేత కార్మికుల సమస్యలు, ప్రభుత్వ హామీలు నిలబెట్టుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకుడు రాముడుతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన నేతన్న నేస్తం రూ.24వేల కంటే ఎక్కువ ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 9నెలలు గడుస్తున్నా నేటికి అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు లక్ష్మన్న, రాజు, వెంకటేష్, శ్రీను, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే పీజీఆర్‌ఎస్ లక్ష్యం

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం (పీజీఆర్‌ఎస్) కార్యక్రమ లక్ష్యమని, కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువు లోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, డీఎల్‌డీఓ రమణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఓటర్ జాబితాపై సమీక్ష

ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా రాజకీయ పార్టీల నాయకులు, సంబంధిత అధికారులతో సబ్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆదోని నియోజకవర్గ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రం హేతుబద్ధీకరణ, నూతన ఓటర్ నమోదు ఫారం 6, 7, 8 సంబంధిత అంశాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఎన్నికల ఉప తహసీల్దార్ గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుచీరను పరిశీలిస్తున్న సినీ నటి రీతూవర్మ

ఆదోనిలో రీతూవర్మ సందడి

ఆదోని అర్బన్: పట్టణంలో సినీ నటి రీతూవర్మ చందనంగా సందడి సందడి చేశారు. సోమవారం పట్టణంలో చందన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటి రీతూవర్మ విచ్చేశారు. ముందుగా ప్రజలకు అభివాదం చేస్తూ సంతోషంగా, ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆదోని ప్రజలను పలకరించారు. నాణ్యమైన, అతి తక్కువ ధరలల్లో చందన షాపింగ్‌మాల్‌లో షాపింగ్ చేయాలని, నగరాలకు వెళ్లకుండా ఆదోని పట్టణంలోనే అతి పెద్ద షాపింగ్‌మాల్ మీకోసం మాల్ నిర్వాహకులు మావూరి శ్రీనివాసరావు, మావూరి సంతోష్ రామ్మోహన్, మావూరి వెంకటగణేష్ తీసుకొచ్చారన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి షోరూంను ప్రారంభించారు. అదేవిధంగా ఆమె నిర్వాహకులతో కలిసి రిబ్బన్ కట్ చేశారు. షాపింగ్ మాల్ మొత్తం కలియతిరిగి చీరలను, బంగారాన్ని ప్రదర్శించారు. చందన షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కూటమి నాయకులు మల్లప్ప, ఉమాపతినాయుడు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి మెమొంటో అందజేస్తున్న నిర్వాహకులు

న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన

ఆదోని అర్బన్: ఎమ్మిగనూరు మండలం కోటేకల్ గ్రామ క్రాస్‌రోడ్డు వద్ద ఈనెల 13వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగలాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వీరేష్ కర్నూలులో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. గురువారం రాత్రి స్థానిక విమలా రెసిడెన్సీకి చెందిన నలుగురు కారులో వస్తుండగా.. నాగలాపురం గ్రామానికి చెందిన వీరేష్ ట్రాక్టర్‌పై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్న విషయం విధితమే. అందులో వీరేష్‌తో పాటు కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో ఆదోని ప్రభుత్వ ఆసుపత్రి, అక్కడి నుంచి కర్నూలుకు మెరుగైన చికిత్స కోసం తరలించారు. ఇందులో వీరేష్ సోమవారం మృతిచెందగా.. మృతదేహాన్ని తీసుకెళ్లి కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు రత్నమ్మ, రామాంజినేయులు నేరుగా స్థానిక విమలా రెసిడెన్సి ముందు బైఠాయించి తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. మృతునికి భార్య సుజాత, చిన్న వయసు గల ఐదు మంది కుమార్తెలు ఉన్నారు. వీరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రెసిడెన్సి నిర్వాహకులు మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి పిల్లలకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది. ఆందోళన చేపడుతున్న విషయాన్ని తెలుసుకున్న వన్ టౌన్, టూటౌన్, త్రీటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐలు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు.


విమలా రెసిడెన్సి ముందు మృతదేహంతో బైఠాయించి ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్‌లోని 98 పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆదోని నియోజకవర్గంలో ఉన్నత పాఠశాలలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 48 ఉన్నాయి. పదోతరగతి పరీక్షలకు 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. తొలి రోజు మొదటి లాంగ్వేజ్‌గా తెలుగు, ఉర్దూ, కన్నడ సబ్జెక్ట్‌లను 3,856 మందికి గాను 3,819 మంది విద్యార్థులు పరీక్షలను రాశారు. 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు గమనార్హం. కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమకు ఇష్ట దైవమైన దేవుళ్ల గుడులకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసుకొని పరీక్ష కేంద్రానికి వచ్చారు. పరీక్ష కేంద్రాల్లో పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులను తనిఖీలు చేసి మరి పరీక్ష కేంద్రంలోని పంపారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షలను ప్రారంభించారు. పరీక్ష కేంద్రాలో పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తూ పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు. పట్టణంలోని నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా కల్పించినట్లు మండల విద్యాధికారులు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు తెలిపారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

మంత్రాలయం : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మంత్రాలయం నియోజకవర్గంలో సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. తొలిరోజు విద్యార్థులు తొందరగానే పరీక్షా కేంద్రాలకు తరలివచ్చారు. మండలంలో మొత్తం నాలుగు సెంటర్లు ఏర్పాట్లు చేశారు. స్థానిక పరిమళ విద్యా నికేతన్‌లో ఎ,బీ సెంటర్లు, మాధవరం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల, సెయింట్ తోమస్ మార్తోమా ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.


ఆదోని నెహ్రూమెమోరియల్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

రవాణా సౌకర్యంలేక ఇబ్బందులు

కౌతాళం: మండలంలో మొదటి లాంగ్వేజ్ తెలుగు, ఉర్దూ, కన్నడ సబ్జెక్టులకు 906మందికి గాను 17 మంది విద్యార్థులు గైర్హజరైనట్లు ఎంఈఓ శోభారాణి తెలిపారు. గైర్హాజరైన వారిలో రెగ్యులర్ విద్యార్థులే కావడం గమనార్హం. ఇదిలా ఉండగా పరీక్ష రాసే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎలాంటి రవాణా సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రమైన కౌతాళంకు చేరడానికి విద్యార్థులు ఆటో ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఆటోలు ఓవర్‌లోడ్‌తో విద్యార్థులను తీసుకుని వచ్చారు.

32 మంది గైర్హాజరు

కోసిగి: పదో తరగతి పరీక్షలకు మండల కేంద్రం కోసిగిలో బాలుర ఉన్నత పాఠశాలలో సెంటర్-ఎ, సెంటర్-బిలు , బాలికల ఉన్నత పాఠశాల, మౌంట్ కార్మెల్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 910 మంది విద్యార్థులకు గాను తొలిరోజు 878 మంది హాజరు కాగా, 32 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ-2 శోభారాణి తెలిపారు.


కౌతాళంలో పరీక్ష రాశాక ఆటో వెనుక స్టాండ్ మీద నిలబడి వెళుతున్న విద్యార్థులు

ఎమ్మిగనూరులో 2,600 మంది హాజరు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఏర్పాటు చేసిన 14 ప్రభుత్వ, జెడ్పీ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 2,600ల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కాగా, మధ్యాహ్నం పరీక్షలు ముగిసిన తరువాత వైఎస్సార్ సర్కిల్ వద్ద విద్యార్థుల ఆటోలతో, ఇతర వాహనాలతో కొద్ది సేపు ట్రాఫిక్ స్తంభించింది. వైఎస్సార్ సర్కిల్ సమీపంలో నాలుగు పరీక్షా కేంద్రాలుండటంతో పరీక్షలు ముగిసిన తరువాత ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

గోనెగండ్ల : మండలంలో పదవ తరగతి పరీక్షకు విద్యార్థులు 627 మంది హాజరు కావాల్సి ఉండగా 617 మంది హాజరయ్యారు. 10 మంది విద్యార్థులు గైర్హజరయ్యారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎగ్జామినర్లు తెలిపారు.

మిత్రుడి సహాయంతో పరీక్ష రాసిన విద్యార్థి


పరీక్ష రాసిన విద్యార్థి

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణానికి చెందిన సుధాకర్ కుమారుడు హెచ్‌వీ. లోకేష్ తన మిత్రుడి సహాయంతో పదవ తరగతి పబ్లిక్ పరీక్ష రాశాడు. లోకేష్ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల హోళీ పండుగ రోజు తన తోటి మిత్రులు రంగుల చల్లడానికి వస్తూ ఉంటే వారిని తప్పించుకోవడానికి వెళ్లి కిందపడటంతో చేయి విరగడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. కుడి చేయి విరిగి పరీక్ష రాయలేని పరిస్థితి ఉండటంతో అధికారులకు విన్నవించగా.. అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తన మిత్రుడు అభిలాష్ చేత పరీక్ష రాయడానికి అవకాశం కల్పించారు. దీంతో మిల్టన్ పాఠశాలలో మిత్రుడి సహాయంతో పరీక్ష రాశాడు.

నందవరం : మండలం కేంద్రంలో పది పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మూడు కేంద్రాలలో 394 మంది రెగ్యులర్ విద్యారులకు గాను 389 మంది పరీక్షకు హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు గైహాజరైనట్లు ఎంఈఓ-2 రఘునాథ్ తెలిపారు. అలాగే సప్లిమెంటరీ, ప్రైవేట్ విద్యార్థులు 39 మంది గాను 35 మంది హాజరైనట్లు చెప్పారు.

మొదటి రోజు ప్రశాంతం

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గురుకుల పాఠశాల మొత్తం 3 పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు పదిమంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఫర్టిలైజర్ షాపులపై చర్యలు తీసుకోవాలి

నందవరం : రైతులకు అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్న ఫర్టిలైజర్ షాపులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(ఏపీకేఎస్) నాయకులు దేవపుత్ర, స్వామి దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రికి వినతి పత్రం అందజేశారు.